క్లుప్తంగా

నిడదవోలు ఎంపీడీఓగా శామ్యూల్



బదిలీపై వెళుతున్న జేపీ ఝాన్సీని సన్మానిస్తున్న ఎంపీడీఓ శామ్యూల్, సర్పంచులు

నిడదవోలు రూరల్: సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన నిడదవోలు ఎంపీడీఓ పి.శామ్యూల్ మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో విధులు ఇక్కడ నిర్వహించిన ఎంపీడీఓ జేపీ ఝాన్సీని కాకినాడ జిల్లాకు బదిలీ చేస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఝాన్సీని సర్పంచులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శామ్యూల్‌కు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరిస్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. వేగేశ్వరపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడి కళాశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. మైదానాన్ని మెరక చేయాలని, భవనంపై కప్పు లీకై నీరు కారుతోందని, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నాడు- నేడు డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా చెట్టు పరిశీలన

కొవ్వూరు: కుమారదేవంలో కూలిపోయిన భారీ నిద్ర గన్నేరు చెట్టును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. రాజమహేంద్రవరం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టడం హర్షణీయం అన్నారు.

నేడు గోపాలపురం మండల సమావేశం

గోపాలపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ కె.రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని వివిధ శాఖల అధికారులు గత సమావేశంలో చేపట్టిన తీర్మానాలు, పనుల వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

అవయవ దానానికి అంగీకారం

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీ సూపర్‌వైజర్, వైద్య ఉద్యోగుల సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్ అవయవ దానానికి తన సంసిద్ధత వ్యక్తం చేస్తూ అంగీకార పత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్‌లకు మంగళవారం అందజేశారు. అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ఆయన ఈ నిర్ణయం తీసుకోవడాన్ని పలువురు ప్రశంసించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు అవయవదాన అంగీకార పత్రం సమర్పించవచ్చు. ఒక వ్యక్తి మరణిస్తే అతని గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం తదితర అవయవాలతో కనీసం 8 మంది ప్రాణాలు కాపాడవచ్చు.

ఉరూరా హర్‌ఘర్ తిరంగా



దేవరపల్లి హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పోలీసు, విద్యాశాఖ అధికారులు

సాక్షి న్యూస్ నెట్‌వర్క్: జాతీయ సమైక్యతకు చిహ్నంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని దేవరపల్లిలో పోలీసులు విద్యార్థుల ఆధ్వర్యంలోను, కొవ్వూరు మండలం ఐ. పంగిడిలో మండల పరిషత్ ఆధ్వర్యంలోను, నిడదవోలులో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలోనూ, గోపాలపురం మండలం చిట్యాల జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలోను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు విద్యార్థులతో కలసి జాతీయ పతాకాలు చేత బూని ప్రదర్శనలు చేశారు. ప్రతి ఇంటిపైనా జాతీయజెండా ఎగరాలంటూ నినదించారు.

పైప్‌లైన్ తీరిది .. తాగునీటికి రక్షణేది?

- లీకేజీల కట్టడికి నెల క్రితమే తవ్విన గోతులు
- నియంత్రణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం
- మురుగునీరు తాగు నీటిలో కలుస్తున్నా చర్యలు శూన్యం
- కొవ్వూరులో కలుషితం అవుతున్న సురక్షిత జలాలు



కొవ్వూరు వేగివారి చావిడి వీధిలో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్ వద్ద తీసిన గొయ్యి నుంచి ఉబికి వస్తున్న తాగునీరు

కొవ్వూరు: తాగునీటి పైప్‌లైన్ల లీకేజీల నివారణపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా పైప్‌లైన్ల నుంచి తాగునీరు లీకై వృథాగా పోతోంది. అంతేకాదు మురుగునీరు పైప్ లైన్లలోకి చేరుతోంది. దాదాపు నెల రోజులుగా పట్టణంలోని 20వ వార్డు వేగివారి చావిడి వీధిలో పైప్‌లైన్ లీకవుతోంది. దీంతో పట్టణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఐదడుగుల మేర గొయ్యి తవ్వించారు. సుమారు 20 రోజులు కావస్తోంది. ఇంత వరకూ మరమ్మతులు పూర్తి కాలేదు. తాగునీటి సరఫరా సమయంలో ఈ గొయ్యి నిండిపోయి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. పక్కనే ఉన్న డ్రైనేజీ వాటర్ సైతం ఈ గోతిలో కలసి, తాగునీరు కలుషితమవుతోంది. మరమ్మతుల్లో భాగంగా ఇక్కడ రోడ్డును మూడొంతుల మేర తవ్వేశారు. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- మెయిన్ రోడ్డులో పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద పైప్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా నెల క్రితం పెద్ద గొయ్యి తవ్వారు. ఐదారు అడుగుల లోతు, వెడల్పున ఉన్న ఈ గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఉండే ఈ రోడ్డు ప్రధానమైంది. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఏడెనిమిది ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇక్కడున్నాయి. నెల రోజులుగా లీకేజీని అరికట్టలేకపోయారు. నిత్యం ఈ గోతిలో మురుగునీరు పెద్ద ఎత్తున నిలిచిపోతోంది. రెండు రోజులకు ఒకసారి మున్సిపల్ సిబ్బంది వచ్చి మురుగునీటిని తోడి రోడ్డుపై పోస్తున్నారు. దాంతో ఇక్కడ అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. ఏటిగట్టుపై మరమ్మతులున్న రెండు మూడుచోట్లా పైప్‌లైన్ లీకేజీలను మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది నివారించారు.
- ప్రస్తుతం గోష్పాద క్షేత్రానికి ఎదురుగా ఉన్న పైప్‌లైన్ నుంచి తాగునీరు ఉబికి వస్తోంది. ఆ నీరంతా వృథాగా పోవడమే గాకుండా మురుగు సైతం పైప్‌లైన్‌లోకి వెళుతోంది. మరమ్మతుల్లో భాగంగా బాపూజీ నగర్‌లోనూ గొయ్యి తవ్వి వదిలేశారు. ఈ గోతిలోనూ నిత్యం మురుగు నీరు నిల్వ ఉంటోంది.
- మినీ బైపాస్ రోడ్డులో ఏసీఆర్ లాడ్జి వద్ద రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద గోతులు తవ్వి వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో పైప్‌లైన్ గోతులు ప్రమాదభరితంగా ఉన్నాయి.

లీకేజీలు వాస్తవమే..

ఇలా పట్టణ వ్యాపంగా 29 చోట్ల పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించామని మునిసిపల్ ఏఈ సుమంత్ తెలిపారు. వాటిలో కొన్నిచోట్ల ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేసినట్టు ఏఈ బదులిచ్చారు. ఇదే విషయంపై మునిసిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను 'సాక్షి' వివరణ కోరగా పట్టణంలో 22 చోట్ల లీకేజీలు ఉన్నాయన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేసి, వాటికి మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే ఆ పనులు చేపడతామని బదులిచ్చారు.



పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ వద్ద పైప్‌లైన్ లీకేజీ కోసం తవ్విన గోతిలో నిలిచి ఉన్న మురుగునీరు



మినీ బైపాస్ రోడ్డులో పైప్‌లైన్ మార్పిడి కోసం తవ్వి వదిలేసిన గొయ్యి



గోష్పాదక్షేత్రం ఎదురుగా ఏటిగట్టుపై పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

మాలకోడు పూడ్చే పనులు ప్రారంభం



మాలకోడు పూడిక పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: స్థానిక రాయపేట మాలకోడు చెరువు ప్రక్షాళనలో భాగంగా రూ.5.78 కోట్ల వ్యయంతో చేపట్టే మురుగునీరు శుద్ధీకరణ కేంద్రం (ఎస్టీపీ) పనుల ప్రాంతాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పరిశీలించారు. మాలకోడు పూడిక పనుల్లో భాగంగా డంపింగ్ యార్డులో లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఉత్పత్తి అవుతున్న ఇసుక, ఇతర మట్టి, రద్దును మాలకోడు చెరువును పూడ్చే పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ నలుమూలల నుంచి సేకరించిన 37 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు డంప్ చేశామన్నారు. అందులో ఇప్పటి వరకు 26 వేల మెట్రిక్ టన్నుల వర్థాలను సైక్లింగ్ చేశామన్నారు. లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా వచ్చిన మట్టి, క్వాలిటీ రబ్బిస్‌తో మాలకోడు మురుగు చెరువును పూడ్చిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ ఎ.మాధవి, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, గంగుల గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు కొత్తగా రెండు ఆర్టీసీ సర్వీసులు

కొవ్వూరు డిపో మేనేజర్ కుమార్ వెల్లడి



కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులతో హైదరాబాద్ బయల్దేరిన ఆర్టీసీ బస్సు

కొవ్వూరు: ప్రయాణికుల సౌకర్యార్థం కొవ్వూరు డిపో నుంచి కొత్తగా రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను హైదరాబాద్‌కు నడుపుతున్నామని డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ మంగళవారం తెలిపారు. మొదటి బస్సు స్థానిక డిపో నుంచి రోజూ రాత్రి 6.45 గంటలకు బయల్దేరుతుందన్నారు. పెద్దేవం, తాళ్లపూడి, పోలవరం, డొండపూడి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ వెళుతుందన్నారు. ఈ సర్వీసును అశ్వారావుపేట నుంచి హైదరాబాద్ వరకూ నాన్‌స్టాప్ సర్వీసుగా నడుపుతున్నామని తెలిపారు. ఇదే బస్సు తిరుగు ప్రయాణంలో బీహెచ్‌ఈఎల్ నుంచి అశ్వారావుపేట వరకూ నాన్‌స్టాప్ సర్వీసుగా నడుపుతున్నామన్నారు. ఇక రెండో సర్వీసు రాజమహేంద్రవరం డిపో నుంచి రాత్రి ఏడు గంటలకు బయల్దేరి కొవ్వూరు బైపాస్ రోడ్డు మీదుగా తాళ్లపూడి, గజ్జరం, గోపాలపురం మీదుగా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ వెళుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో బీహెచ్‌ఈఎల్‌లో రాత్రి 7.20 గంటలకు బయల్దేరి జంగారెడ్డిగూడెం వరకూ నాన్‌స్టాప్ సర్వీసుగా నడుపుతున్నామని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమంగా ఇసుక తరలించిన వ్యక్తిపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అక్రమంగా ఇసుక తరలించిన ములంపాక వరహాలరావు (వర్మ)పై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని సింహాద్రి ఎన్టీపీసీలో పనుల నిమిత్తం కాంట్రాక్టర్ ఇచ్చిన లెటర్‌తో పెండ్యాల స్టాక్ పాయింట్ నుంచి 38 లారీల ఇసుకను వరహాలరావు తరలించారు. అయితే ఎన్టీపీసీ పనుల వద్దకు ఒక్క లారీ మాత్రమే వచ్చినట్టు కాంట్రాక్టర్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వరహాలరావు అనే వ్యక్తి 37 లారీల ఇసుకను అక్రమంగా తరలించినట్టు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్, చాగల్లు డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

తాగునీటి లభ్యతపై సమగ్ర సర్వే



సర్వేలో భాగంగా కొవ్వూరు మండలం దేచెర్లలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

కొవ్వూరు: పల్లెల్లో తాగునీటి లభ్యతపై జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మండలంలో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. తాగునీటి సరఫరా, వినియోగం, సరఫరా, నాణ్యత వంటి వివరాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటిలో ఎంతమంది కుటుంబ సభ్యులున్నారు? వారి వివరాలు, పబ్లిక్, డొమెస్టిక్ కుళాయి కనెక్షన్ల వివరాలు, రోజువారీగా ఎన్నిసార్లు, ఎంత సమయం తాగునీటి సరఫరా చేస్తున్నారన్న వివరాలు సేకరిస్తున్నారు. ఆ గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు ఇంటికి ఎంత దూరంలో ఉందనే వివరాలు కూడా తీసుకుంటున్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకుంటున్నారు. ఈ విధంగా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగంలో 20 అంశాలపై సమగ్ర సర్వే జరుపుతున్నారు. ఈనెల 14న రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి సరఫరాపై శ్వేతపత్రం విడుదల చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ సర్వేలో లబ్ధిదారుల వివరాలతో పాటు ఫోన్ నంబర్‌లు, డోర్ నంబర్‌లతో అన్నీ వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పర్యవేక్షణలో సచివాలయ కార్యదర్శి ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది.

పవర్ వీడర్‌తో కలుపు నివారణ సులభం

జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు



పవర్ వీడర్ ద్వారా కలుపుతీసే విధానాన్ని కాపవరం రైతులకు వివరిస్తున్న మాధవరావు

కొవ్వూరు: ఎలాంటి రసాయన మందులు వాడకుండానే పవర్ వీడర్ సాయంతో వరి పంటలో కలుపును సులభంగా తీయవచ్చని, ఈ విధానం వల్ల ఖర్చులు ఆదా అవుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని కాపవరం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఆయన పర్యటించారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కేవలం రెండు నుంచి మూడు గంటల వ్యవధిలో రెండున్నర లీటర్ల పెట్రోలు ఖర్చుతో ఎకరం వరి పొలంలోని కలుపు తీసుకోవచ్చని వివరించారు. ఎకరం పొలంలో ఒకసారి పవర్ వీడర్ వినియోగానికి రైతుకు రూ.600 నుంచి రూ.700 వరకూ మాత్రమే ఖర్చువుతుందన్నారు. పవర్ వీడర్ ద్వారా కలుపు తీసే విధానాన్ని మాధవరావు ప్రయోగాత్మకంగా రైతులకు చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం బి.తాతారావు, ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏవో ఎ.గంగాధర్, మండల ఎంటీ మహారాణి, ఎస్ఎఫ్‌జే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: స్థానిక కూచిపూడి గంగరాజు అనే రైతు పొలంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలు తీర్చేలా ఆంధ్ర ప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ద్వారా క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గేప్ పొలంబడి పథకాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు. మానవాళిపై విష ప్రభావం చూపే పురుగుల మందులు విధానాన్ని చార్టు గీసి రైతులకు వివరించారు. పురుగు మందుల వాడకం, పిచికారీ విధానాన్ని వివరించారు. అంతకు ముందు రైతుల వ్యవసాయ పరిజ్ఞానాన్ని తెలుసుకొనేందుకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ కమల్‌రాజ్, డీఆర్సీ ఏడీఏ శ్రీమతి రామలక్ష్మి, డీఆర్సీ ఏఓ వెంకన్నబాబు, ఏఈఓ పుష్పలత, వీహెచ్‌ఓ రామకృష్ణ, రైతులు గంగరాజు, గిరిధరరావు, యలమాటి శ్రీను పాల్గొన్నారు.

తీపర్రులో వంతెన అప్రోచ్‌కు మరమ్మతులు



తీపర్రు వద్ద వంతెన అప్రోచ్ రోడ్డు కు చేసిన మరమ్మతులు

పెరవలి: తీపర్రు - తాటిపర్రు వంతెన అప్రోచ్ రోడ్డు మరమ్మతులు అత్యవసరంగా పూర్తి చేశామని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండ్రాజవరం- పెరవలి మండలాలను కలిపే ఈ వంతెన అప్రోచ్ రోడ్డు మండలంలోని తీపర్రు వద్ద ఇటీవలి వర్షాలకు కుంగిపోయింది. ఈ నెల 9న మంత్రి దుర్గేష్ తీపర్రు గ్రామం వచ్చినపుడు గ్రామస్తులు ఈ వంతెన అప్రోచ్ రోడ్డు దుస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వంతెన వద్దకు వెళ్లి పరిశీలించిన మంత్రి ఆర్ అండ్ బీ శాఖ అధికారులకు వెంటనే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు పనులు చేపట్టాలని ఆదేశించారు. దాంతో ఆ శాఖ అధికారులు అప్రోచ్ కుంగిన ప్రదేశంలో వెదురు బొంగులు కాల్వలో పాతి క్వారీ చక్రు వేశారు. దీంతో ప్రయాణికులు సమస్య తీరింది.

325 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు



ఖండవల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెరవలి: మండలంలోని ఖండవల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పెరవలి పీహెచ్‌సీ డాక్టర్ ఎ.కృష్ణవేణి ఆధ్వర్యంలో 325 మంది విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వారిలో 12 మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్టు గుర్తించి, వారికి ఐరన్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేష్, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా శిక్షణ

- హాజరు కాని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు



సమిశ్రగూడెం శిక్షణ కార్యక్రమంలో ఒక్క కార్యదర్శి మినహా.. ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నిడదవోలు రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి 100 రోజుల ప్రణాళికలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు మండలంలో తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాల్సి ఉండగా ఒకరిద్దరు మినహా మిగిలిన వారు హాజరు కావడం లేదు. రెండో రోజు మంగళవారం 12.10 గంటలకు ×సాక్షి₹ పరిశీలించగా ఒక్క సమిశ్రగూడెం పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శి చైతన్య లక్ష్మి మాత్రమే ఉన్నారు. మిగిలిన కుర్చీలు ఖాళీగా దర్శన మిచ్చాయి. ఎంపీడీఓ, కార్యాలయ ఏఓ, ఈఓపీఆర్డీ సైతం పై అంతస్తు భవనంలోని సమావేశ మందిరంలో జరిగే శిక్షణకు వెళ్లకుండా తమ రోజువారి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు సర్పంచులు ఎంపీపీతో సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల కేంద్రాల నిర్వహణ, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీ, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ లేకుండానే మూడు రోజులు ముగిసే అవకాశాలు ఉన్నాయి.

కొవ్వూరు: మండలంలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు రెండో రోజు మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం బస్సులో ఐ.పంగిడిలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్టు యూనిట్ (సంపద కేంద్రాన్ని)కు ప్రజాప్రతినిధులు వెళ్లి దానిని పరిశీలించారు. వ్యర్థాలను వేరు చేసి చెత్తను ఏవిధంగా వర్మీ కంపోస్టుగా తయారు చేస్తున్నారో ప్రత్యక్ష్యంగా చూపించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, ఎంపీడీవో కె.సుశీల, ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ కేవీఎస్ఎస్‌యు ఎం శర్మ, రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండో రోజు రామన్నపాలెంలో కొనసాగింది. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్‌లు, కార్యదర్శులు పరిశీలించారు. సంపద కేంద్రంలో తయారు చేసిన వర్మీ కంపోస్టును పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానం గురించి సర్పంచ్‌లకు అధికారులు వివరించారు. ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, టీఓటీలు , సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

చాగల్లు: 'శిథిలావస్థలో కల్వర్టులు' అనే శీర్షికన ఈ నెల 12న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. దారవరం -కొవ్వూరు రహదారిలో మల్లవరం వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టు పునఃనిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని ఆర్ అండ్ బీ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ రమణ తెలిపారు. కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని మంగళవారం తెలిపారు. నిధులు మంజూరు కాగానే కల్వర్టు పునఃనిర్మాణం చేపడతామని చెప్పారు.

మానవత సంస్థకు రూ.30 వేల విరాళం



శాంతిరథం కొనుగోలుకు మానవత సంస్థ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

ఉండ్రాజవరం: శాంతి రథం (మృతదేహాలు తరలించే వాహనం) కొనుగోలు నిమిత్తం మానవత సంస్థ మండల శాఖకు మంగళవారం దాతలు ముందుకు వచ్చి రూ.30 వేలు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మానవత సంస్థ చైర్మన్ తాతిన వెంకట కృష్ణారావు వేలివెన్నులో మాట్లాడారు. బలభద్ర భాస్కరరావు గుప్తా రూ.10 వేలు, తణుకుకు చెందిన తీగల సీతారామచంద్రరావు జ్ఞాపకార్థం భార్య లక్ష్మి సువర్చల రూ.10 వేలు, దువ్వ గ్రామానికి చెందిన వత్తిమిల్లి రామచంద్రరావు జ్ఞాపకార్థం భార్య ప్రభావతి రూ.10 వేల నగదు అందజేశారని వివరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, కార్యదర్శి ఫణితిన పార్వతి, కోశాధికారి కోడూరి శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మార్కెట్ ఏరియా బ్రాంచ్-23571
మద్దాల సత్యం గారి కాంప్లెక్స్, విజయలక్ష్మి సెంటర్ దగ్గర, భాగ్యలక్ష్మి పేట, తాడేపల్లిగూడెం, ఆర్‌పి-ఏలూరు
ఫోన్ : 9653823571, E mail: UBIN0823571@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన రూల్ 8(1)

ఇందుమూలముగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మార్కెట్ ఏరియా బ్రాంచ్, [illegible] ... 2002 [illegible] సెక్షన్ 13(2) క్రింద [illegible] ... రూ.12,48,106.56 పై [illegible] ... తేది.02.05.2024 న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

[illegible] సెక్షన్ 13(4) క్రింద [illegible] ... తేది.09.08.2024 న స్వాధీనం చేసుకున్నారని [illegible]

[illegible] సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు [illegible]

[illegible] రూ.12,48,106.56 [illegible] యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మార్కెట్ ఏరియా బ్రాంచ్, వారి చార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

[illegible]

తేది : 09.08.2024
ప్రదేశం : తాడేపల్లిగూడెం
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా